# ప్రాయోజిత కార్యక్రమం

"నువ్వు అక్కడ ఒక్కడివే ఉండి ఏం తంటాలు పడ్తావు. ఇల్లు అమ్మేసిరా. ఇక్కడ ఫ్లాటు కొనుక్కోవచ్చు. అద్దె ఇళ్ళల్లో ఉండి నాకూ ఇబ్బందిగా వుంది" అని ప్రద్యుమ్న నాలుగైదు ఉత్తరాలు రాశాక ఇల్లు బేరం పెట్టాడు బలరామయ్య. మరీ పట్నం కుగ్రామం కాని ఆ ఊళ్ళో పాత ఇల్లు రెండు లక్షల కంటే పలకలేదు. నిజానికి ధర పల్కింది స్థలానికిగాని ఇంటికి కాదు. ఇల్లు పిత్రార్జితం కనుక రిజిస్ట్రేషనుకు కొడుకు ప్రద్యుమ్న, కూతురు భవాని కూడా వచ్చారు. రిజిస్ట్రారు ఆఫీసు నుండి ఇంటికొచ్చిన, కొడుకును బయటకు తీసుకువెళ్ళి చెప్పాడు బలరామయ్య. "మీ అమ్మ పోయాక నాకూ ఇక్కడ ఉండటానికి మనస్కరించటం లేదు. అందుకే మా నాయన ఇచ్చిన ఇల్లును అమ్మాను. వచ్చిన డబ్బును చెరి సగం తీసుకుంటే బావుంటుందని నా ఆలోచన."

"ముందుగా ఫ్లాటు కొన్నాక మనం వెసులుబాటు చూసుకుని చెల్లెలికి డబ్బిద్దాం. ఇప్పుడే దానికి డబ్బిస్తానని చెప్పొద్దు. మనం త్వరలో ఇవ్వలేకపోతే అది మనసు కష్టపెట్టుకుంటుంది." అన్నాడు ప్రద్యుమ్న.

అప్పటికి "సరే"నని తలూపాడు. కాని, ప్రద్యుమ్న మాటలు ఎంతవరకు నమ్మొచ్చో తేల్చుకోలేకపోకయాడు బలరామయ్య. ఎదిగొచ్చిన కొడుకు తనకెప్పుడూ నిజం చెప్పలేదు. అయినా ఆయన ఎప్పటికప్పుడు పుత్రవ్యామోహంలో పడిపోతూనే వుంటాడు.

ప్రేమించి వర్ణాంతర వివాహం చేసుకున్నాడు ప్రద్యుమ్న. పెళ్ళయిన ఆర్నెల్లకుగానీ బలరామయ్య దంపతులకావిషయం తెలియలేదు. ఎవరో చెప్తే తెల్సి నిర్ఘాంతపోయారు. నమ్మలేకపోయారు. నిర్ధారణ కోసం ప్రద్యుమ్నకు రాస్తే అతను జవాబిచ్చాడు. "వర్ణాంతర వివాహం కనుక నువ్వూ, అమ్మా అంగీకరించరని భయపడ్డాను. అందుకే మీకు తెలియ పర్చలేదు. నన్ను మీరిద్దరూ క్షమించగలరు" అంటూ, అదేదో చిన్న విషయమన్నట్టూ, తనకు మాత్రమే సంబంధించిన విషయమన్నట్టూ రాశాడు. జానకమ్మ మనసు కలత బారిపోయింది. బలరామయ్యకు కోపం వచ్చింది. ఉత్తరాలు రాయటం మానుకున్నాడు.

ప్రద్యుమ్న స్టాఫ్ సెలక్షన్ పరీక్షలో పాసయి, సెంట్రల్ ఎక్సైజులో ఉద్యోగం సంపాదించుకున్నాక బలరామయ్యకు కొంత మానసిక బలం చేకూరింది. పిల్ల పెళ్ళికి కొడుకు ఆర్థికంగా సాయం చేయగలడని ఆశించాడు. కానీ, హైదరాబాద్ వెళ్ళిన కొడుకు తండ్రికి పైసా పంపించలేదు. ఉద్యోగంలో చేరిన నాలుగు నెల్లకు తండ్రికి ఉత్తరం రాశాడు ప్రద్యుమ్న. "ఆఫీసుకు వెళ్లటం ఇబ్బందిగా ఉంది. స్కూటర్ ఇన్‌స్టాల్ మెంట్ పద్ధతిలో తీసుకుంటున్నాను. మీకు డబ్బు పంపుదామనుకున్నాను. కానీ, కుదరలేదు." అని.

అందుకు బలరామయ్య ఏమనలేకపోయాడు. "డబ్బు విచ్చలవిడిగా ఖర్చు చేయకు. చెల్లెలి పెళ్లి కూడా వుంది. ఈ రోజుల్లో ఆడపిల్ల పెళ్లి అంటే ఎంతో ఖర్చు పెట్టాల్సి వస్తోంది" అని మాత్రం హెచ్చరిక చేశాడు, 'చెల్లెలి పెళ్ళికి నువ్వు సాయం చెయ్యాలి' అని సూచిస్తూ. నాలుగు నెలల తర్వాత ప్రద్యుమ్న తల్లికి ఉత్తరం రాశాడు, "పదిరోజు సెలవు పెట్టి నార్త్ ఇండియా టూరు వెళ్తున్నాన"ని. ఆ తర్వాత ఫ్రిజ్ కొన్నానని రాశాడు. ఇలా ఖర్చు పెడ్తూ వుంటే జీవితంలో పైకి రావటం కష్టం. ఈ విషయంలో కొడుకును మందలిస్తూ గట్టిగా ఉత్తరం రాస్తానని బలరామయ్య అంటే, "మనలాగే జీవితం గడపాలా? మీరేం రాయకండి. వాడు నొచ్చుకుంటాడు" అని వారించింది జానకమ్మ.

కానీ, తన ప్రేమ పెళ్లికి, కాపురానికి కావల్సిన వస్తువులు ప్రద్యుమ్న సమకూర్చు కుంటున్నాడని తెల్సుకోలేకపోయారు తల్లిదండ్రులు. ప్రద్యుమ్న మళ్ళీ ఎప్పుడూ డబ్బు పంపలేకపోయానని రాయలేదు. ఈ లోపల కొడుకు పెళ్ళయినట్లు వర్తమానం అందింది. అంతకు వారం రోజుల క్రితం ఎప్పుడూ వచ్చినట్టే తల్లిదండ్రులను చూట్టానికి వచ్చాడు కానీ అప్పటికే అతనికి పెళ్ళయిందని వాళ్ళకు తెలియలేదు.

మనసులోని బాధనూ, కినుకనూ అణచుకున్న బలరామయ్యకు ఇంక కొడుకు భవాని పెళ్ళికి ఆర్థిక సాయం చెయ్యడని అర్థమైంది. తన స్కూలు టీచరు ఉద్యోగంలో కూడబెట్టిందేం లేదు. పిల్లల చదువులకే ఎంతో ఖర్చు పెట్టాల్సి వచ్చింది. ప్రద్యుమ్నకు ఇంటరు, బి.ఎస్.సి. అయ్యాక రెండుసార్లూ ఇంజనీరింగ్‌లో రాంకు రాకపోవటం వల్ల డొనేషన్లు కట్టి ఆ పెద్ద చదువుకు పంపలేకపోయాడు బలరామయ్య.

కొడుకు పెళ్లి సంగతి తెల్సాక ఇంక కూతురు పెళ్ళి వాయిదా వెయ్యలేదు ఆయన. తనకూ రిటైర్మెంటు వయసు వస్తున్నది. సంబంధాలు వెదకటం మొదలు పెట్టాడు. చివరకు తమ ఊరివాడే సుదర్శనం కొడుకు శంకరనారాయణతో సంబంధం నిశ్చయమైంది. పేచీ లేకుండా సుదర్శనం స్పష్టంగా చెప్పాడు. "చూడు బలరామయ్యా! నీ కొడుకు నీకు చెప్పకుండా వర్ణాంతర వివాహం చేసుకున్నాడు. అది మాకు సంబంధం లేని విషయం. నువ్వు ఎలాంటి మనిషివో నాకు తెలియంది కాదు. అయితే, కట్నం మాత్రం నువ్వు

రెండు లక్షలివ్వాలి. మా అబ్బాయి ఇంజనీరింగ్ చదువుకు నాకు అప్పయింది. వాడి చదువుకు అప్పు చేశాను కనుక, పిల్లనిస్తానని వచ్చిన నిన్ను కట్నం అడుగుతున్నానని అనుకోవద్దు. నాకు ఇంకా ఇద్దరు ఆడపిల్లలున్నారు. వాళ్ళ పెళ్లి చెయ్యాలి. వాడు హైదరాబాద్‌లో ఎలక్ట్రిసిటీ బోర్డులో పనిచేస్తున్నాడు. నా ఆర్థికపరమైన ఇబ్బందులు వాడి నెత్తిన వేయటం నాకిష్టం లేదు. అందుకే కట్నమనుకో, మరేమనుకో, నువ్వు నాకు రెండు లక్షలు ఆర్థికంగా సాయం చెయ్యాలి. తరువాత నీ ఇష్టం" అని.

మంచి సంబంధం. వదలుకోలేక పోయాడు బలరామయ్య. సుదర్శనం చెప్పిన మాటల్లో ఆయనకు తప్పేం కన్పించలేదు.

కొడుకు వ్యవహారంతో మనసు విరిగిపోయి వున్న బలరామయ్య తనకున్న రెండెకరాల పొలం బేరం పెట్టాడు. మూడు లక్షలకు బేరం సెటిలైంది. ఎలాగో తన బాధ్యత గట్టెక్కుతుందని సంతోషించాడు ఆయన. రిటైరైనా తనూ, తన భార్య పెన్షను రాళ్ళతో ఎలాగో బతుకు వెళ్ళదీయవచ్చు. ప్రద్యుమ్న కూడా రిజిస్ట్రేషనుకు హాజరుకావాలి కనుక ఎన్నో రోజుల తర్వాత, విషయాలు వివరిస్తూ ఉత్తరం రాశాడు బలరామయ్య. బదులుగా ప్రద్యుమ్న ఉత్తరం రాశాడు. "పెళ్ళయ్యాక అభిలాషకు నేను నగలేం చేయించలేకపోయాను. ఒకటే గునుపు. యాభైవేలు లోనుకు అప్లయి చేశాను. అది రావటం ఆలస్యం పట్టవచ్చు, నువ్వు యాభైవేలు సర్దగలిగితే నేను పెళ్ళికి వచ్చేటప్పుడు ఆ డబ్బు తీసుకురాగలను" అంటూ. బలరామయ్యకు అర్థమైంది కొడుకు బేరం పెట్టాడని. మనసుకు కష్టమనిపించినా తప్పలేదు. ఎడ్వాన్సుగా తీసుకున్న ఇరవైవేలకు, మూడు రూపాయల వడ్డీపై తెచ్చిన ముప్ఫయివేలు కలిపి– మొత్తం యాభైవేలు డి.డి పంపాడు.

డి.డి అందాక ప్రద్యుమ్న వచ్చాడు. పొలం రిజిస్ట్రేషనయింది. కట్నం కాక, పెళ్ళికే లక్షరూపాయలపైన ఖర్చయింది బలరామయ్యకు. డబ్బుచాలక అప్పు చెయ్యాల్సి వచ్చింది. కొడుకు తీసుకున్న యాభైవేల ప్రస్తావన మళ్ళీ చెయ్యలేదు. బలరామయ్యా అడగలేదు.

భవాని పెళ్ళికి భార్యను తీసుకువచ్చాడు ప్రద్యుమ్న. బలరామయ్య దంపతులకు అదే మొదటిసారిగా కోడల్ని చూడటం. చాల అయిష్టంగానే అభిలాష వచ్చిందని వాళ్ళకు త్వరలోనే అర్థమైంది. ఎవరితోనూ కలివిడిగా తిరగలేదు ఆమె. కోడలికి భద్రతాభావం కలగాలన్న ఉద్దేశంతో జానకమ్మ చెప్పింది, "నువ్వు బిడియ పడకమ్మాయి! మీపెళ్ళికి మేం రాలేకపోయాం. ఇది నీ ఇల్లే అనుకో" అని.

"ఇది నా ఇల్లు ఎలా అవుతుంది. అయినా మీకు మా పెళ్ళి ఇష్టం లేదటగా?" అంది అభిలాష ముఖం ముడుచుకుంటూ.

"మాకు తెలిస్తే కదా ఇష్టమో, అయిష్టమో తెల్పటానికి!" అంది జానకమ్మ నొచ్చుకుంటూ.

"మీది గొప్ప కులం కదా! మీరు మా పెళ్ళికి ఒప్పుకోరనే ప్రద్యుమ్న మీకు తెలియపర్చలేదు."

"పోన్లే, ఇప్పుడా సంగతులన్నీ ఎందుకూ?"

"ఎందుకూ అంటే అయిపోతుందా? మీరు నన్ను వేరుగా చూడటం నేను గమనించ లేదనుకోకండి. మీకంత కష్టమనిపిస్తే, నాకు విడాకులిప్పించేసి మీ కొడుక్కు మరో పెళ్ళిచేసుకోండి."

కోడలు మాటలు విని నిర్విణ్ణ అయింది జానకమ్మ. ఇంక ఆ పెడసరం పిల్లతో మాట్లాడటం అనవసరం అనుకుంది ఆమె. వెళ్ళేటప్పుడు చీరె పెట్టి పంపటం తప్ప ఆమె మరి కోడలితో మాట్లాడింది లేదు.

భవాని పెళ్ళయ్యాక జానకమ్మ రెండేళ్ళకంటే ఎక్కువకాలం బతకలేదు. బ్రెయిన్ ట్యూమర్‌తో చని పోయింది. పోతుందని తెల్సినా గుంటూరు తీసుకెళ్ళి చికిత్స చేయించాడు బలరామయ్య. తను రిటైరయ్యాడు కానీ రిటైర్మెంటు బెనిఫిట్స్ ఆయన చేతికందలేదు. కూతురి పెళ్ళికి అప్పయింది. భార్య చికిత్స కోసం డబ్బు అందక గిజగిజలాడి పోయాడు బలరామయ్య. మనస్కరించక పోయినా, డబ్బుసాయం చేయగలడేమోనని ప్రద్యుమ్నకు ఉత్తరం రాశాడు. ఇరవయ్యో శతాబ్ది తొమ్మిదో దశకంలో ఫోను వాడకం అంత విరివిగా ఉండేది కాదు. ఉత్తరాలు, అర్జెంటయితే టెలిగ్రాములే గతి. కొడుకు దగ్గరి నుండి జవాబు రాలేదు బలరామయ్యకు. తల్లి పోయిందని టెలిగ్రాం ఇచ్చినప్పుడు వచ్చాడు ప్రద్యుమ్న.

"అమ్మ కిలా ఉందని ఉత్తరం రాస్తే నేను వచ్చేవాడినిగా?" అన్నాడు.

"రాశాను" అన్నాడు బలరామయ్య కొడుకు ముఖంలోకి పరిశీలనగా చూస్తూ.

"నాకంద లేదు" అన్నాడు ప్రద్యుమ్న.

అతని మాటలు ఎంతవరకు నమ్మవచ్చో నిర్ధారించుకోలేకపోయాడు బలరామయ్య.

అస్థి సంచయనం అయ్యాక, కొడుకు నడిగాడు బలరామయ్య, "మీ అమ్మ అస్థికలు కాశీ గంగలో నిమజ్జనం చేస్తావుట్రా. అయ్యే ఖర్చు నేను పెట్టుకుంటాను" అని.

"నాకిప్పుడు సెలవు దొరకదు. ఇక్కడికి రావటమే కష్టమైంది. కృష్ణలో కలుపుతాలే" అన్నాడు ప్రద్యుమ్న.

అతడిలా అన్నాక మరేమనలేక పోయాడు బలరామయ్య.

దినవారాలయ్యాక భర్తతో హైదరాబాదు వెళ్ళబోతూ అంది భవాని "నువ్వు ఇక్కడ ఒంటరిగా ఏం ఉంటావు నాన్నా! హైదరాబాదు వచ్చెయ్యి. అన్నయ్య దగ్గరా, నా దగ్గరా ఉండొచ్చు" అని.

అక్కడే ఉన్న ప్రద్యుమ్న చెల్లెలి మాటలు విననట్టు ఊర్కుండి పోయాడు.

అయినా పుట్టి పెరిగి, ఉద్యోగం చేసిన ఊరిని అంత తేలిగ్గా వదల లేక పోయాడు బలరామయ్య.

అయితే, ఐదేళ్ళ తర్వాత ప్రద్యుమ్న తన్ను హైదరాబాదు వచ్చి వుండమని వరసగా ఉత్తరాలు రాయసాగాడు. కొడుకులో మార్పు వచ్చిందేమోనని భ్రమసి పోయాడు బలరామయ్య. బిడ్డల పట్ల వ్యామోహం అలాంటిది. అలవాటులేక తనకూ చెయ్యి కాల్చుకోటం కష్టంగానే ఉంది. కులాల పట్టింపు తన భార్యకేగానీ తనకెలాగూ లేదు. మనవడు, మనవరాలితో కాలక్షేపం చెయ్యవచ్చు. కృష్ణారామా అంటూ కాలం వెళ్ళ దీయవచ్చు అనుకున్న బలరామయ్య ఇల్లమ్మేశాడు. ఇల్లమ్మిన డబ్బులో కూతురికి భాగం పెడ్దామన్న తండ్రి మాట పడనివ్వలేదు ప్రద్యుమ్న. ఆ తర్వాత చెల్లెలికి లక్షరూపాయ లివ్వాలన్న విషయమూ మర్చిపోయాడు.

బలరామయ్య రిటైరయినప్పుడు మూడున్నర లక్షలదాకా వచ్చాయి. ఫ్లాటు కొనాలనుకున్న కొడుక్కు ఇల్లమ్మిన రెండు లక్షలూ కాక, అప్పులు తీర్చగా మిగిలిన రెండు లక్షల్లో, ఒకటి తానుంచుకుని, వెరసి మూడు లక్షలిచ్చాడు. అప్పుడే అంది కోడలు "బోడి మూడు లక్షలకు ఏం వస్తుంది! 'నాయన, నాయన' అంటూ కలవరించావు. చివర కొచ్చింది చిప్ప - మహా ముచ్చటగా మూడు లచ్చలు" అని.

"మూడు లక్షలు కాదమ్మాయి! నేను మీకు ఇవ్వ గలిగింది రెండే. మిగిలిన ఒక లక్షా వెసులుబాటు చూసుకుని భవాని కివ్వండి" అని స్పష్టంగా చెప్పాడు బలరామయ్య.

"అంతదానికి మేమివ్వటమెందుకూ? మీరే ఇచ్చుకోండి" అని చేతులు తిప్పుకుంటూ కోడలు వంటింట్లోకి పోయింది. కానీ ప్రద్యుమ్న చెల్లెలికి డబ్బు ఇస్తానని మాత్రం అనలేదు.

నాలుగు లక్షల్లో వచ్చే ఫ్లాటుతో తృప్తి పడలేదు భార్యాభర్తలు. మరో ఐదు లక్షలు హెచ్‌డిఎఫ్‌సిలో లోను తీసుకుని, మొత్తం ఎనిమిది లక్షలకు ఫ్లాటు తీసుకోవాలని నిర్ణయించారు. ఆమాట ప్రద్యుమ్న చెప్పినప్పుడు, "అంత లోను తీసుకోవద్దు ఇన్‌స్టాల్‌మెంటు కట్టటం కష్టమవుతుంది. మన తాహతుకు మించి అప్పు చేయటం ప్రమాదకరం" అని హెచ్చరిక చేశాడు బలరామయ్య.

"ఎప్పుడో ఏదో అవుతుందని భయపడ్తూ బతకటం నా వల్ల కాదు. మేం ఇరుకు కొంపల్లో జీవితం గడపలేం. నువ్వు అన్నింటికి అనవసరంగా భయపడ్తూవుంటావు" అన్నాడు ప్రద్యుమ్న.

"అంతే మరి! స్కూలు టీచరు మనస్తత్వం!" అని వ్యాఖ్యానించింది అభిలాష.

బలరామయ్యకు కష్ట మనిపించింది కానీ ఆమె స్థాయికి దిగి మాట్లాడాలనిపించక ఊరు కొన్నాడు.

లిబరలైజేషన్ పాలసీ వచ్చాక బాంకులు, ఇతర ఆర్థిక సంస్థలూ లోను మేళాలు నిర్వహించి అప్పులిచ్చేస్తున్నాయి. అప్పుల్ని ఎలా రాబట్టుకోవాలో కూడా వాటికి తెల్సు. తామనుకున్నట్టే అమీర్‌పేట సెంటర్లో మంచి ఫ్లాటే తీసుకున్నాడు ప్రద్యుమ్న.

కొడుకు దగ్గరకు వచ్చాక గానీ తన తప్పిదం తెల్సిరాలేదు బలరామయ్యకు. కొడుకూ, కోడలూ పిల్లల్నితీసుకుని సాయంత్రం పూట వారంలో నాలుగు రోజులయినా బయటే భోజనం చేస్తూంటారు. పొద్దున పూట ఆఫీసుకు వెళ్ళే హడావుడిలో తనకు చేతనైనదేదో ఉడకేసి వెళ్ళిపోయేది అభిలాష. తను అలవాటైన వంటకూ, ఆమె వంటకూ తేడా వుండేది. అన్నింట్లోనూ ఆమె మసాలాలు వేసేది. బలరామయ్య కది సహించేది కాదు. అందుకే ఓసారి, "నా వంట నేను చేపుకుంటానులే, అమ్మాయి! పొద్దున పూట ఆఫీసుకు వెళ్ళే హడావుడిలో ఉంటావు. మీ వంట మీరు చేసుకోండి" అని చెప్పాడు. అంతే, ఆ తర్వాత అభిలాష ఆయనకోసం వంట చేయటం మానేసింది. ఆపైన, "అవును, మాతిళ్ళు మీరు తింటారా? నాదే పొరపాటు" అంది.

ఫ్లాటు కొన్నాక, అలమార్లకు చెక్కపని చేయించలేదన్న మథన పట్టుకుంది దంపతులకు.

"వీధి వైపు ఫ్లాటు వద్దంటే విన్నావు కాదు. అలమర్ల నిండా దుమ్మే. దులపలేక ఛస్తున్నాను" అని సాధించేది అభిలాష.

భార్య పోరు పడలేక, "నాన్నా! నాకు జనవరిలో లోను ఎలిజిబులిటీ వస్తుంది. మా కోఆపరేటివ్ సొసైటీలో తీసుకుంటాను. ఓ ముప్పైవేలుంటే ఇవ్వు. లోను రాగానే ఇచ్చేస్తాను" అనడిగాడు ప్రద్యుమ్న తండ్రిని.

కొడుకు డబ్బు తిరిగివ్వడని అనుమానమున్నా లేదని చెప్పలేక పోయాడు బలరామయ్య. బాంకులో డబ్బు డ్రాచేసి తీసుకు వచ్చి ఇచ్చాడు. జనవరి వచ్చింది. పోయి ఆర్నెల్లయిందిగానీ ప్రద్యుమ్న తండ్రికివ్వాల్సిన డబ్బు ఇవ్వలేదు. బలరామయ్య అడగలేక పోయాడు. ఇంట్లో ఉండి కొడుకు పెడ్తుంటే తిని కూర్చోటమే కాదు, తనూ ఆర్థికంగా సాయం చెయ్యాలని సున్నితంగా తెలియజెప్పారు కొడుకూ, కోడలూ.

ఓ రోజు పొద్దున్నే ప్రద్యుమ్న అభిలాష పోట్లాడుకోసాగారు.

"నీకు బుద్ధిలేదు. డ్యూడేట్ లోపల ఎలక్ట్రిసిటీ బిల్లు కట్టమన్నానా? రేపు వాడొచ్చి కరెంటు సప్లయ్ కట్ చేస్తేగానీ నీకు తెల్సిరాదు" అనరిచాడు ప్రద్యుమ్న.

"ఏంవిటీ నాకు తెలిసొచ్చేది! నాకు తీరికుండదు నిన్నే కట్టమని చెప్పాను" అంది అభిలాష తనూ గొంతు పెంచి.

"ఎప్పుడు చెప్పావు- నిన్న, అన్ని రోజులూ ఊర్కొని. నాకు వంద పనులు, కుదుర్తుందా?"

"అయితే నన్నేం చెయ్యమంటావు! ఇంటి పని, ఆఫీసు పని! ఛస్తున్నాను. నేనూ మనిషినే. నాకు సాయం వచ్చేవాళ్ళెవరూ లేరు కొంపలో. నాకు విడాకులిచ్చేసి అన్ని పన్లూ చేసేదాన్ని కట్టుకో."

"నోర్మూసుకో. ఎప్పుడో ఆపనీ చేస్తాను. అప్పుడుకానీ నీకు తెల్సిరాదు."

"ఆс, మహానుభావుడవు దొరికావు నాకు దొరక్కదొరక్క!"

తాత చెప్తున్న పాఠం పుస్తకం పక్కన పెట్టి, "అంతా హాట్ హాట్‌గా వుంది, తాతా! రేపు చెబ్దువుగానిలే పాఠం" అన్నాడు మనవడు బలరామయ్యతో.

"ఎందుకట్లా మమ్మీ, డాడీలు పోట్లాడుకుంటారు, తాతా?" అనడిగింది మనవరాలు పద్మ.

బలరామయ్య లేచి, వంటింట్లోకి వెళ్ళి, "ఆ కరెంటు బిల్లూ, డబ్బూ నాకివ్వమ్మా! నాకు తీరికేగా, నేను కట్టొస్తాను ఇ-సేవ సెంటరులో" అన్నాడు కోడలితో.

"ఏం తెలియనట్లు నన్నడుగుతారేం? మీ అబ్బాయి టేబుల్ డ్రాయరులో ఉంటాయి బిల్లూ, డబ్బూ."

కొడుకూ-కోడలూ ఆఫీసుకు, పిల్లలు స్కూళ్ళకూ వెళ్ళాక, స్నానం సంధ్యా పూర్తి చేసుకుని, తిరిగొచ్చి వంట చేసుకోవాలనుకుంటూ ప్రద్యుమ్న టేబుల్ డ్రాయరు తెరచి చూస్తే, అందులో కరెంటు బిల్లు కన్పించింది కానీ, డబ్బు లేదు. 'డబ్బు పెట్టటం మర్చి పోయారేమోలే, సాయంత్రం ఇస్తారు' అని తన దగ్గరున్న డబ్బుతో 937 రూపాయల బిల్లూ కట్టివచ్చాడు బలరామయ్య.

సాయంత్రం ఇంటికొచ్చాక బిల్లు ఎలా కట్టావని కొడుకుగానీ కోడలుగానీ అడగలేదు. అదే నాంది అయింది ఆయనకు మిగతా బిల్లులు కూడా కట్టటం. పైగా కోడలు "ఎంతొచ్చినా కొంపలో గుండమై పోతోంది. తినే మనుషులు ఎక్కువయేసరికి డబ్బుకి కటకటలాడే పరిస్థితి వచ్చింది" అనేది. బలరామయ్యకు అర్థమైంది. అయినా మోహం చావలేదు.

ఆ మరుసటి నెల్లోనే కొడుకు చెప్పాడు బలరామయ్యకు.

"ప్రస్తుతానికి ప్రతి నెలా మెయింటెనెన్స్, ఫోను, ఎలక్ట్రిసిటీ బిల్లులు నువ్వు కట్టు నాన్నా! డబ్బు వెసులుబాటు కావటం లేదు. ఓ ఆర్నెల్లయితే పరిస్థితి సర్దుబాటు అవుతుంది. ఆ తర్వాత నేనే కట్టుకుంటాను" అని.

అలా సుమారుగా నెలకు రెండువేలు బిల్లుల రూపేణా చెల్లించాల్సి వచ్చింది బలరామయ్యకు. వచ్చే పెన్షనులో ఐదారొందలు మాత్రం మిగిలేది. తన మందుల ఖర్చులు పోగా ఏ వందో మిగిలేది. కూతురింటికి వెళ్ళాల్సి వచ్చినా, బయట పనుల మీద వెళ్ళాల్సినా బస్సు చార్జీలకు వాడుకునేవాడు ఆ డబ్బు. అదనపు ఖర్చేమయినా వస్తే ఆ నెల ఇబ్బంది పడిపోయేవాడు బలరామయ్య.

ఓ రోజు బలరామయ్య కూరలు తేవటానికి మార్కెట్టుకు వెళ్తూంటే, అటుగా కారులో వెళ్తూన్న రఘుపతి, మాష్టార్ని చూసి, కారు ఆపి, దిగి పలకరించాడు. అతనెప్పుడో ఏళ్ళ క్రితం ఆయన దగ్గర చదువు కున్నాడు. రఘుపతి పలకరించినా వెంటనే గుర్తు పట్టలేక పోయాడు ఆయన.

"నేనిక్కడ మేడ్చల్‌లో ఓ రెసిడెన్షియల్ స్కూలు నడుపుతున్నా, మాష్టారూ! అక్కడికి మీరొకసారి రావాలి" అని చెప్పాడు రఘుపతి.

"ఎందుకు రానూ, తప్పకుండా వస్తాను. నిన్ను చూసి చాలా సంతోషమైంది, నాయనా!"

"మిమ్మల్ని చూశాక నాకో మాట అడగాలనిపిస్తున్నది. మీకు ఒంట్లో ఓపిక ఉంటే మా స్కూల్లో పని చేయండి. మీలా పాఠం చెప్పే టీచర్లు కరువయ్యారీ రోజుల్లో. అక్కడే ఉండొచ్చు. మీకెంత జీతం కావాలంటే అంత ఇస్తాను. మీకు సాయ పడదామని ఈ మాట చెప్పటం లేదు. పిల్లలు మీ చేతుల్లో మణిపూసల్లా తయారవుతారని అడుగుతున్నా."

రఘుపతి ఆదరణ చూసి బలరామయ్య కళ్ళు చెమర్చాయి.

"అలాగే చూద్దాంలే, బాబూ!" అన్నాడాయన.

"మీ ఇష్టం. మీరెప్పుడు వచ్చినా ఆహ్వానమే!" అని చెప్పి, తన విజిటింగ్ కార్డు ఇచ్చి, ఆయన్ని మార్కెట్టు దాకా వదలి వెళ్ళాడు రఘుపతి. రఘుపతికి పాఠం చెప్పినట్టే, తన కొడుక్కూ పాఠం చెప్పాడు. తను ఎక్కడ తప్పిదం చేశాడు - అన్న ఆలోచనలో పడి పోయాడు బలరామయ్య.

రఘుపతిని చూశాకే ఆత్మీయతల ప్రపంచం నశించిపోలేదన్న ఆశ్వాసన కలిగింది బలరామయ్యకు. తన కొడుకు నమ్మిన వస్తుమార్పిడి ప్రపంచం మాత్రమే కాదది. ప్రద్యుమ్నకున్న వస్తు సంచయ వ్యామోహం హద్దులు దాటి పయనిస్తోంది.

ఆ మధ్య పాత టివి పనికి రాలేదని కొత్తది కొనుక్కువచ్చాడు. ఎక్స్ఛేంజ్ ఆఫర్‌లో పాతది ఇచ్చేసి, కొత్త టివిని ఇరవై వేలకు తీసుకువచ్చాడు, వాయిదాల పద్ధతిలో.

"పాత టివి బాగానే పని చేస్తుంది కదా? ఎన్నింటికి ఇన్‌స్టాల్‌మెంట్లు కడతావు?" అనడిగాడు.

"దానికంటే ఇది పెద్ద స్క్రీను నాన్నా! బొమ్మ బాగా వస్తుంది" అన్నాడు ప్రద్యుమ్న టీవి తెరకు మోహాన్ని అతికించి.

ఆ తర్వాత కొత్త ఫ్రిజ్, వాషింగ్ మెషీనూ కొనుక్కు వచ్చాడు ఇన్‌స్టాల్‌మెంట్లలో. కొత్త తివాచీ కొని ఇంటికి తీసుకువచ్చినప్పుడు, ఇంక ఉండబట్టలేకపోయాడు బలరామయ్య.

"ఇలా డబ్బు తగలబెట్టటమేం బాగా లేదు. తాహతుకు మించి ఖర్చు చేస్తున్నావు. ఈ వస్తుసంచయ వ్యామోహంలో పడితే అంతూ దరీ ఉండదు. గుర్తుంచుకో" అన్నాడు.

"మీరు బతికినట్టే దరిద్రపు బతుకు మేం బతకాలా? తెలియక పోతే మాట్లాడకుండా ఉండటం మంచిది" అంది అభిలాష దులపరిస్తూ.

"నాది తప్పేలే తల్లీ! తెలియక అన్నాను" అన్నాడు ఆయన మనస్సు చివుక్కుమనిపించి.

కొడుకు అప్పులు చేస్తున్నట్టు అనుమానపడ్డాడు కానీ ప్రద్యుమ్నను అడగలేక పోయాడు ఆయన. అంతకు ముందు క్రెడిట్ సొసైటీలో అప్లయి చేసిన లోను యాభై వేలు వచ్చాయి. తండ్రి కివ్వాల్సిన ముప్ఫైవేల సంగతీ మర్చి పోయాడు ప్రద్యుమ్న. కొన్ని పాత బాకీలకు వడ్డీలు చెల్లువేశాడు. ఇంకో ఇరవైవేలు మిగిలాయని చెప్పి భార్యాబిడ్డలతో ఓ పదిరోజులపాటు దక్షిణదేశ యాత్రలు చేసి వచ్చాడు ప్రద్యుమ్న. మాట వరసకయినా తండ్రిని తమతో రమ్మని అనలేదతను.

ఓ సారి వారం రోజులుగా ఆఫీసుకు పోకుండా ఇంట్లోనే ఉండిపోయాడు ప్రద్యుమ్న. ఆఫీసుకెందుకెళ్ళటం లేదని బలరామయ్య కొడుకును అడిగితే, అభిలాష సమాధానం చెప్పింది.

"ఏం వెళ్తాడు? పదిహేనువేలు సంపాదించే మోహానికి నాలుగు క్రెడిట్ కార్డు లెందుకూ? వాటిపై లోను తీశాట్ట. డబ్బేం చేశాడో మరి! ఆఫీసుకెళ్తే ఫోన్లు చేసి వాళ్లు బతకనీయటం లేదు. మావాళ్ళు నలభై వేలు సర్దినా ఇంకా లక్షకు పైనే అప్పుందట. అందుకే, సిగ్గులేని మనిషి మొహం చాటేస్తున్నాడు. మావాళ్ళు ఆ నలభైవేలు ఎప్పుడిస్తాడో అడగమన్నారు."

"ఏం చేశానేంటి – నీ ఎదానే పెట్టాను. నాకేం బాడ్‌హేబిట్స్ లేవు, డబ్బు తగలెట్ట టానికి. ఎలాగో అడ్జస్టు చేసుకుంటాం. ఈ విషయాలన్నీ నాన్నకు చెప్పాలా?" అన్నాడు ప్రద్యుమ్న భార్యను కసురుకుంటూ.

"ఏం అడ్జస్టు చేసుకుంటావు? మీనాన్న ఎడ్జస్టు చేసి పెడతాడు నీకు – తెచ్చిపెట్టు కున్నావుగా నెత్తిన. నా నుండి నీకు విడాకులిప్పిస్తాడులే" అంది అభిలాష రుసరుసలాడుతూ.

"ఇప్పుడా ప్రసక్తి ఎందుకమ్మా? మీరు విడిపోవాలని నేనన్నానా?" అన్నాడు బలరామయ్య.

"మరి అందుకు కాక మీరు మరెందుకు మా నెత్తిన వచ్చి కూర్చున్నారు?"

అప్పుడే మొదటిసారిగా కొడుకు దగ్గర నుండి వెళ్ళిపోవాలని అన్పించింది బలరామయ్యకు. తాను చేసిన తప్పిదం స్పష్టంగా తెలియవచ్చింది. అయితే, దీనంగా వున్న కొడుకు మోహం చూసి ఆయన మనసు కరిగిపోయింది. ఆఫీసుకు వెళ్ళకపోతే పిల్లల్ని ఎలా పైకి తీసుకురాగలడు, సంసారం, ఎలా గడపగలడు అని మధనపడిపోయాడు ఆయన. తనకు అది ఆత్మహత్యా సదృశ్యమే అయినా, కొడుక్కు తన చేతనయిన చివరిసాయం చెయ్యాలని నిర్ధారించుకున్నాడు.

"మూడేళ్ళ క్రితం నువ్వు ఇంట్లో చెక్కపని చేయిస్తానంటే నేను దాచుకున్న లక్ష రూపాయల్లో నీకు ముప్ఫైవేలు ఇచ్చాను. నువ్వా డబ్బు నాకు వాపసు చేయలేదు. సరే, దాన్ని గూర్చి నాకు బాధలేదు. మిగిలిన డెబ్బైకి వడ్డీ కలిపి ఎనభై, తొంభై వుంటుందేమో నా ఖాతాలో. ఎంత ఉంటే అంత తీసుకో. అయితే, ఓ మాట గుర్తుంచుకో. ఇది నేను చేయగల చివరి ఆర్థిక సాయం. ఆ తర్వాత నావల్ల కాదు."

ఆ గండం గట్టెక్కిచ్చుకున్నాడు ప్రద్యుమ్న ఎలాగో. అయితే, వాళ్ళ జీవనపద్ధతిలో మాత్రం ఎటువంటి మార్పు రాలేదు. పండగ వచ్చిందంటే తమకు, పిల్లలకు నాలుగైదు జతల ఖరీదైన బట్టలు, తిరుగుళ్ళు, పిక్నిక్‌లు, బయట హోటళ్ళలో పార్టీలు– ఏదీ తగ్గలేదు.

మరో మూడేళ్ళల్లో పరిస్థితి మరింత విషమించింది. ఇంట్లో ప్రదుమ్న, అభిలాష పోట్లాడుకో సాగారు. ఒకళ్ళ తప్పులు మరొకళ్ళు ఎంచుకోసాగారు. నాలుగురోజులు మల్లగుల్లాలు పడ్డాక ప్రద్యుమ్న చెప్పాడు తండ్రికి. "ఫ్లాటు అమ్మేస్తున్నాను నాన్న! రేపే రిజిస్ట్రేషను. మేం నాలుగు రోజుల్లో అద్దెకు ఇల్లు చూసుకుని మారిపోతాం. మేం సెటిలయ్యే దాకా నువ్వు భవాని ఇంట్లో ఉండు. వారం పదిరోజుల్లో మా దగ్గరకు తిరిగి వద్దువుగాని" అని.

ఫ్లాటు అమ్మేయటమంటే కొనటానికి అప్పిచ్చిన కంపెనీకి అప్పు మొత్తం చెల్లించాలి. అంటే ప్రద్యుమ్నకు ఏం మిగలదు. మళ్లీ జీవితం మొదలుపెట్టాలి. బలరామయ్య కొడుకు మొహంలోకి చూశాడు సూటిగా. 'ప్రద్యుమ్న నిజం చెప్పడు. మనసులో మాట చెప్పడు.

తను వాడికి శత్రువా?' అనుకున్నాడు బలరామయ్య. 'నిజమేనేమో, అప్పులు తీర్చటానికే ఇల్లు అమ్ముతున్నాడేమో, తన్ను బయటకు పంపేయత్నంకాదేమో ఇది' అనీ అనుకున్నాడు.

ఆయన కొడుకుతో ఒక్కమాట మాట్లాడలేదు. కోడలికీ చెప్పలేదు. తనకున్న మూడు ధోవతులూ, మూడు చొక్కాలూ చేతి సంచీలో పెట్టుకున్నాడు.

"ఎక్కడకు వెళ్తున్నావు, తాతా?" అనడిగాడు కిరణ్.

"వస్తాగా!" అని ఇదమిత్థం కాని సమాధానం చెప్పి బయటి కదుగు పెట్టాడు బలరామయ్య.

సీదా మేడ్చల్ దారిపట్టాడు. రఘుపతి తన గురువుగార్ని సాదరంగా ఆహ్వానించాడు. వెళ్ళంగానే చెప్పాడాయన రఘుపతితో "నా శక్తి మేరకు నీ పిల్లలకు పాఠాలు చెప్తాను. నాకు జీతం ఇవ్వాల్సిన పనిలేదు. ఇంత అన్నం పెట్టు బాబు!" అని.

"అదేంటి మాస్టారూ! అలా అంటారు. మీరు స్కూల్లో పనిచేయకపోయినా మీకు భోజనానికి కరువేముంది? మా ఇంట్లోనే ఓ గదిలో ఉందురుగాని, నేనూ మీ కొడుకులాంటి వాడినే" అన్నాడు రఘుపతి.

మనసు విరిగిన బలరామయ్య ఓ సంవత్సరం వరకూ ఎవరికీ ఫోను కూడా చెయ్యలేదు. కొడుకు ఎలా ఉన్నాడో కూతురు ఎలా ఉందో అన్న దిగులేసేది. కోరిక అణచుకోలేక ఓ సారి భవానికి ఫోను చేశాడు.

"అవును. అన్నయ్య ఫ్లాటు అమ్మేసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. మొన్నీ మధ్య మా ఇంటికి వచ్చాడు. డబ్బుకి ఇబ్బందిగా వుందని చెప్పి ఆయన దగ్గర ఓ ముప్పైవేలు పట్టుకెళ్ళాడు. వదినకీ, అన్నయ్యకూ పడుతున్నట్టు లేదు. ఎప్పుడూ మా ఇంట్లో ఉండనివాడు ఆ రోజు రాత్రి మా ఇంట్లోనే ఉన్నాడు. ఇంతకీ నువ్వెలా వున్నావు, ఎక్కడున్నావు, నీ ఆరోగ్యం ఎలా వుంది?" అని అడిగింది భవాని. వివరంగా అన్నీ చెప్పాడు బలరామయ్య.

ఆ రోజు స్టాఫ్‌రూంలో కూర్చుని వారపత్రిక తిరిగేస్తుంటే, తన కాసక్తి కలిగించే రైటప్ కన్పించింది ఆయనకు. అందులో ఇలా వుంది! "1920 నాటికి పెళ్ళి ఓ పవిత్ర బంధం. 40-60ల మధ్య సాంఘిక భద్రతతో కూడిన గౌరవస్థాయి. 60-90ల మధ్య కట్నాల వ్యాపార జూదం. 90-2000 నాటికి పెళ్ళి కేవలం ఓ స్పాన్సర్డ్ ప్రోగ్రాం. మార్కెట్ ఎకానమీ మంచాల మీదకు వచ్చిన తర్వాత ప్రతి ముద్దు వెనుకా ఏదో ఓ స్పాన్సర్ షిప్ కావల్సిందే! మగాళ్ళు కరెన్సీ నోట్లుగా, ఆడవాళ్ళు అలసిసొలసిన మగాళ్లను నిద్ర పుచ్చే స్లీపింగ్ పిల్స్‌గా మారిపోయారు. ఇందులో ఎమోషనల్ టచ్ ఏమాత్రం లేదు.

అంతా యాంత్రికం! అందుకే విడాకులరేటు విపరీతంగా పెరిగి పోతోంది. ఒత్తిడి పెరుగుతున్నది సరిగ్గా ఇక్కడే! భావుకత మార్కెట్‌లో దొరికే వస్తువు కాదు. వివాహ వ్యవస్థతో విసుగెత్తి పోతున్న దంపతులు ఇవాల్టి రోజున ముందు కలవాల్సింది లాయర్‌ను కాదు. మంచి సైకియాట్రిస్టును!! మనసు తర్వాతే చట్టమైనా, దేవుడైనా!"

పత్రిక చదువుతుంటే తన కొడుకు సమస్యకేదో పరిష్కారం లభించినట్లయింది బలరామయ్యకు. తలెత్తి చూసేసరికి ఎదురుగా ప్రద్యుమ్న కన్పించాడు. విచిత్రంగా అతన్ని చూసినా కోపం కలగలేదు బలరామయ్యకు.

"డబ్బు కోసమే కదా వచ్చావు! నేను చెప్పేమాట వినేటట్లయితే, నీకు ఓ ఇరవై వేలు ఇప్పిస్తాను రఘుపతి చేత" అన్నాడాయన ప్రద్యుమ్నతో, అతడిని బయటకు తీసుకు వెళ్తూ.

"అది కాదు, నాన్నా! నేను దాన్నుండి విడాకులు తీసుకుంటున్నాను..." అని ఏదో చెప్పబోయాడు ప్రద్యుమ్న.

"నువ్వు నీ పెళ్ళాంనుండి విడిపోతే నేను సంతోషిస్తానని మీరు భావించారు. దాన్ని ఎప్పుడూ నా మీద ట్రంప్ కార్డులా ప్రయోగించ చూశారు. మీరు విడిపోవాలని నేనెప్పుడూ కోరుకోలేదు. మీరు సంసారాన్ని ప్రాయోజిత కార్యక్రమం చేసుకున్నారు. స్పాన్సర్‌షిప్ లేకుండా టివి కార్యక్రమాలు సాగవు. మీ సంసారం సాగటానికి ఎంతమంది స్పాన్సర్ చేయాలి. ఆ స్పాన్సరర్ అయ్యే తాహతు నాకు లేదు. నన్ను క్షమించు. నేను చెప్పింది చేస్తే నీకు ఇరవై వేలు ఇస్తాను. ఏమంటావు?" అని కొడుకు మొహంలోకి చూశాడు బలరామయ్య.

"ఏంటది?"

"మీరు లాయర్ని కాదు కలవాల్సింది. మంచి సైకియాట్రిస్టును కలిసి ఆయన సలహా తీసుకోండి. మీ సంసారం బాగుపడుతుంది. నీకు సమస్యలు ఉండవు."

మారు మాట్లాడకుండా ప్రద్యుమ్న వెళ్ళిపోసాగాడు. బలరామయ్య పిల్చినా విన్పించుకోలేదు. తల దించుకుని స్కూలు గేటు దాటుతున్న కొడుకుని చూసి బలరామయ్య గుండె కకావికలైపోయింది.

*జాగృతి (వారపత్రిక, 20 అక్టోబర్ 2003, దీపావళి ప్రత్యేక సంచిక)*